సాక్షి
కర్నూలు
గురువారం । 30 । మే । 2024



సాక్షి గణపతికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై బుధవారం సాక్షి గణపతికి అభిషేకం విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: క్షేత్రంలోని నిత్యకళావేదికపై నరసరావుపేటకు చెందిన నటరాజ కూచిపూడి నాట్య నిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన బుధవారం భక్తులను అలరించింది.



ప్రాణాలు తీసుకున్నారు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం నలుగురు యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఎంతో భవిష్యత్ ఉన్నా అర్ధాంతరంగా తమ జీవితాలను చాలించారు. 8లో▸

న్యూస్‌రీల్

శ్రీ మఠం హుండీ ఆదాయం రూ.2,93,11,306



కానుకలు లెక్కిస్తున్న సేవా భక్తులు

మంత్రాలయం: ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి హుండీ కానుకల లెక్కింపు బుధవారం మధ్యాహ్నం ముగిసింది. మే నెలకు సంబంధించి 29 రోజులకు గానూ హుండీ ఆదాయం రూ. 2,93,11,306 వచ్చినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాస రావు తెలిపారు. ఇందులో నగదు రూ.2,85,57,126, నాణేలు రూ.7,54,180తో పాటు, 136 గ్రాముల బంగారం, 1,510 గ్రాముల వెండి సమకూరినట్లు మఠం మేనేజర్ వివరించారు.

నేడు, రేపు ఇంటర్‌లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 30, 31వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ జిల్లా కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలురకు 43 సీట్లు మిగలగా, ఇందులో ఎంఈసీ గ్రూపులో ఎస్సీ 23, బీసీ –1, సీఈసీ గ్రూప్‌లో ఎస్సీ 11, ఎస్టీ 01, బీసీ 02, బైపీసీ గ్రూప్‌లో ఎస్సీ 03, బీసీ 02 సీట్లు ఉన్నాయన్నారు. గురుకుల ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఈ సీట్లను భర్తీ చేస్తామని, ఈ నెల 30వ తేదీన బాలురకు చిన్నటేకూరులో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అలాగే బాలికలకు 37 సీట్లు మిగలగా, ఎంఈసీ గ్రూపులో ఎస్సీ 15, ఎస్టీ 01, ఓసీ 01, సీఈసీ గ్రూపులో ఎస్సీ 02, బీసీ 04, హెచ్‌ఈసీ గ్రూపులో ఎస్సీ 06, బీసీ 01, ఎంపీసీ గ్రూపులో బీసీ 01, బైపీసీ గ్రూపులో బీసీ 05, ఓసీ 01 సీట్లు ఉన్నాయన్నారు. వీరికి కూడా ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా దిన్నెదేవరపాడులో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించమన్నారు. వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి తొలుత ప్రాధాన్యత ఇస్తామని, ఆతర్వాత ప్రతిభ ఆధారంగా మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

ప్రశాంతంగా పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మూడోరోజు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 11,560 మంది విద్యార్థులకుగాను 8,899 మంది హాజరవ్వగా...2,661 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మరోవైపు డీఈఓ శామ్యూల్‌పాల్ రెండు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ వెల్లడించారు.

రూ.1.6కోట్లతో డైస్ సెంటర్ ప్రారంభం



జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని నేషనల్ హెల్త్ మిషన్ గ్రాంట్ కింద రూ.1.6 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా సత్వర చికిత్సా కేంద్రాన్ని (డిస్ట్రిక్ట్ అర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్) బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలను హెల్త్ స్క్రీనింగ్ చేసి పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులను గుర్తించి చికిత్స కేంద్రానికి రెఫర్ చేయాలన్నారు. అక్కడ ఉండే వైద్యులు చిన్నారులను అక్కున చేర్చుకుని వారిని మామూలు స్థితికి తీసుకు వచ్చేందుకు వైద్యసేవలు అందిస్తారన్నారు. మానసిక, శారీరక ఎదుగుదల లేని సమస్యలను సైతం ఇక్కడ నయం చేస్తారన్నారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ హేమలత, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, చిన్న పిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ విజయానందబాబు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు నాణ్యమైన విద్యుత్

- పగటి పూటనే తొమ్మిది గంటల సరఫరా
- ముమ్మరంగా కొత్త లైన్‌లు, సబ్ స్టేషన్‌ల నిర్మాణం
- రూ.41 కోట్ల హడ్కో నిధులతో 321 కిలోమీటర్ల కొత్త లైన్‌లు
- ఐదు 33/11 కెవి సబ్ స్టేషన్‌లు
- బేతంచెర్లలో రూ.60 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్



రూ.60 కోట్లతో బేతంచెర్లలో నిర్మించిన 220 కేవీ సబ్ స్టేషన్

వ్యవసాయ 'వెలుగులు'

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో పగటి పూటనే 9 గంటల విద్యుత్‌ను మరింత నాణ్యతతో అందించేందుకు విద్యుత్ శాఖ కసరత్తు చేస్తోంది. ఏపీఎస్పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో కొత్త లైన్లు ఏర్పాటు, ఉన్న లైన్‌ల సామర్థ్యం పెంపు, సబ్ స్టేషన్‌ల సామర్థ్యాన్ని(ఎంవీఏ) పెంచడం, కొత్త సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించడం విశేషం. సాగునీటి వనరులు అందుబాటులోకి రావడంతో ఏడాదికేడాది ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు పెరుగుతున్నాయి. కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో బోర్లలో భూగర్భ జలాలు పెరగడంతో రైతులు కూరగాయల పంటలతో పాటు ఆరుతడి పంటలు జోరుగా సాగు చేస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయంలో ఉచిత విద్యుత్‌కు శ్రీకారం చుట్టి 7 గంటల పాటు విజయవంతంగా ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం ఏడు గంటల విద్యుత్ ఇవ్వడంలో కిందామీదా పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వడానికి శ్రీకారం చుట్టారు. తొమ్మిది గంటల పాటు నిరంతరం నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. పలు ప్రాంతాల్లో 220/133/ 33 కేవి విద్యుత్ సబ్ స్టేషన్‌లు నిర్మించడం, విద్యుత్ లైన్‌లను అభివృద్ధి చేయడం కలిసి వచ్చింది.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

- గతంలో ఎప్పుడూ లేని విధంగా 2023–24 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 25 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు.
- ప్రస్తుతం కర్నూలు జిల్లాలో 1,14,286, నంద్యాల జిల్లాలో 1,09,713 ప్రకారం ఉమ్మడి జిల్లాలో 2,23,999 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి.
- ఇందువల్ల రానున్న వ్యవసాయ సీజన్‌లో విద్యుత్ లోడ్ భారీగా పెరిగే అవకాశం ఉంది.
- ఇందులో భాగంగా లైన్ సామర్థ్యాన్ని రూ.15 కోట్లతో పెంచనున్నారు.
- కర్నూలు కార్బైడ్ 220 కేవీ సబ్ స్టేషన్ నుంచి గూడూరు వరకు ఉన్న ఏపీ ట్రాన్స్‌కో లైన్ సామర్థ్యం పెంపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- ఈ లైన్ సామర్థ్యం ప్రస్తుతం 70 మెగా వాట్స్ ఉంది. ఈ లైన్ ద్వారా 120 మెగావాట్స్ విద్యుత్ సరఫరా చేసేందుకు ఉద్దేశించిన పనులు చేపడుతుండటం విశేషం.
- ప్రస్తుతం ఏసీఎస్‌ఆర్ ప్యాన్కర్ కండక్టర్‌తో లైన్ ఉంది. ఇది వచ్చే ఖరీఫ్ సీజన్‌లో పెరిగే లోడ్‌ను తట్టుకోలేదనే ఉద్దేశంతో లైన్ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. తాజాగా ఏసీఎస్ఎస్ కండక్టర్‌లోకి మారుతుండటం వల్ల విద్యుత్ సామర్థ్యం పెరుగుతుంది.
- గడివేముల మండలం గని నుంచి సోమయాజులపల్లె వరకు ఏపీ ట్రాన్స్‌కో లైన్ సామర్థ్యాన్ని పెంచడానికి రంగం సిద్ధమైంది.

హడ్కో నిధులతో కొత్త లైన్‌లు

వ్యవసాయానికి, పరిశ్రమలకు మరింత నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రూ.41 కోట్లతో కొత్త లైన్‌లతో పాటు కొత్త సబ్ స్టేషన్‌లు.. 263 కిలోమీటర్ల మేర 33 కెవి లైన్‌లు, 58 కిలోమీటర్ల 11 కేవీలైన్‌లు ఏర్పాటు చేస్తోంది. ఇందుకు సంబంధించిన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో విద్యుత్ శాఖకు కర్నూలు టౌన్, కర్నూలు రూరల్, నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరుల్లో డివిజన్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో హడ్కో నిధులతో కొత్తలైన్‌లు వేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేగాక ఐదు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లు ఏర్పాటవుతున్నాయి. ప్యాపిలి మండలం గార్లదిన్నె, డోన్ మండలం తిమ్మాపురం, మంత్రాలయం మండలం సూగూరు, బండిఆత్మకూరు మండలం వీఆర్‌పేట, రుద్రవరం మండలం నాగులవరం గ్రామాల్లో సబ్ స్టేషన్‌లు నిర్మించనున్నారు.

బేతంచెర్లలో 220 కేవీ సబ్ స్టేషన్ సిద్ధం

నంద్యాల జిల్లాలోని బేతంచెర్ల మండలం నాపరాతి పాలిషింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు కూడా ఎక్కువే. వీటన్నింటికీ నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం లక్ష్యంగా రూ.60 కోట్లతో ఏపీ ట్రాన్స్ 220 కేవీ సబ్ స్టేషన్‌తో పాటు లైన్ కూడా వేస్తున్నారు. నిర్మాణ పనులు ముగింపుదశలో ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో లో వోల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు వచ్చేవి. ఇందువల్ల విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం జరిగేది. ఇక్కడ 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు అవుతుంటంతో అన్ని సమస్యలకు పరిష్కారం లభించినట్లయింది. కాగా కర్నూలు జగన్నాథగట్టులోని టిడ్కో హౌసింగ్ దగ్గర కొత్తగా 132 కేవీ సబ్ స్టేషన్ నెలకొల్పడానికి రంగం సిద్ధమైంది. ఇప్పటికే టెక్నికల్ ఫీజుబులిటీ రావడం విశేషం.

రూ.306 కోట్లతో ఆర్‌డీఎస్ఎస్ లైన్‌లు

గ్రామాలకు, వ్యవసాయానికి రూ.306.19 కోట్లతో ప్రత్యేక లైన్‌లు సిద్ధమవుతున్నాయి. ఆర్‌డీఎస్ఎస్ కింద రికార్డు స్థాయిలో లైన్‌లు వేస్తుండటం విశేషం. 33 కేవీ లైన్ 114 కిలోమీటర్ల పొడవున రూ.11.19 కోట్లతో.. రూ.295 కోట్లతో 11 కేవీ లైన్ 5,207 కిలోమీటర్లు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని డివిజన్‌లను కలుపుతూ ఈ లైన్‌లు సిద్ధం చేస్తున్నారు.

రూ.25 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల సామర్థ్యం పెంపు

అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం లక్ష్యంగా 33/11 కేవీ సబ్ స్టేషన్‌ల సామర్థ్యం పెంపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు అరికట్టడం, లైన్‌లాస్ నివారించడం లక్ష్యంతో సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు తెలుస్తోంది. రూ.25 కోట్లతో అడిషనల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో ఎంవీఏ పెంచుతుండటం విశేషం. ఇప్పటి వరకు 25 సబ్ స్టేషన్‌లలో అడిషనల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు పూర్తయింది. రానున్న రోజుల్లో 36 సబ్ స్టేషన్‌ల సామర్థ్యం పెంపునకు రూ.32.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. జూన్ 4 తర్వాత మంజూరయ్యే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ పగటి పూటనే తొమ్మిది గంటలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. ఇందుకోసం కొత్త లైన్‌లు, కొత్త సబ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నాం. రైతులు అడిగిన ప్రాంతాల్లో మాత్రమే వ్యవసాయానికి రెండు, మూడు దఫాలుగా విద్యుత్ ఇస్తున్నాం. – **ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ, ఉమ్మడి కర్నూలు జిల్లా**

లెక్కింపు కేంద్రాల్లోకి 'తమ్ముళ్లు'

- స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్ల కొనుగోలుకు టీడీపీ బేరసారాలు
- తమ వారి పేర్లు ఇవ్వాలని అభ్యర్థి సంప్రదింపులు

కర్నూలు: ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన కర్నూలు అసెంబ్లీ బరిలోని టీడీపీ అభ్యర్థి ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఎక్కువ మంది తన వారిని పంపేలా వ్యూహాలు పన్నుతున్నారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు/ఏజెంట్ల నియామకానికి ఈనెల 30లోపు వివరాలు పంపాలని జిల్లా కలెక్టర్/రిటర్నింగ్ అధికారి డాక్టర్ సృజన సూచించారు. ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, ఎన్‌డీఏ కూ టమి అభ్యర్థితో పాటు మరో 23 మంది అభ్యర్థులు కర్నూలు బరిలో ఉన్నారు. అభ్యర్థుల తరపున ఏజెంట్లు నియమించుకోవడానికి ఆధార్ కార్డులతో పాటు గుర్తింపు పత్రాలు, ఫొటోలు ఇస్తే గుర్తింపు కార్డులు జా రీ చేస్తారు. గుర్తింపు పొందిన పార్టీలతో పాటు పో టీలో ఉన్న ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా వారి తరపున ఏజెంట్లను నియమించుకునేందుకు అవకాశం ఉండటంతో స్వతంత్ర అభ్యర్థులకు ఎరవేసి వారి తరపున కూడా తన వారిని నియమించుకునే వ్యూహాన్ని కర్నూలు టీడీపీ అభ్యర్థి పన్నుతున్నట్లు ఆయన శిబిరంలో చర్చ జరుగుతోంది. స్వతంత్రంగా ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్న 8 మంది, ఎంపీ అభ్యర్థిగా ఉన్న ఒకరి తరపున ఉన్న ఏజెంట్లకు బదులు టీడీపీ అభ్యర్థి సొంత మనుషులను ఏజెంట్లుగా నియమించుకున్నట్లు సమాచారం. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అభ్యర్థులు, వారి ఏజెంట్లకు మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతిస్తుంది. దీంతో స్వతంత్ర అభ్యర్థుల తరపున తన పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు, సామాజిక వర్గానికి చెందిన యువకులను ఏజెంట్లుగా నియమించుకున్నట్లు తెలిసింది. లెక్కింపు కేంద్రం లోపల తన వారు ఎక్కువ మంది ఉండేలా చూసుకుంటున్నారని, అవసరమైతే లోపల గొడవలకు కూడా సిద్ధంగా ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు ఇలాంటి ప్రలోభాలను ఎలా నిలువరిస్తారోనన్న చర్చ జరుగుతోంది.

హాట్ టాపిక్‌గా మాజీ కార్పొరేటర్‌పై దాడి ఘటన

మూడు దశాబ్దాలుగా ముఖ్య అనుచరుడుగా కొనసాగిన ఓ మాజీ కార్పొరేటర్‌పై ఎన్నికల పోలింగ్ రోజు ప్రముఖ పారిశ్రామికవేత్త దాడి చేయించిన ఘటన హాట్‌టాపిక్‌గా మారింది. తన కుమారునికి వ్యతిరేకంగా పాతబస్తీలో ప్రచారం నిర్వహిస్తున్నాడని వేగులు ఇచ్చిన సమాచారంతో ఆయన ఆగ్రహించినట్లు తెలిసింది. పోలింగ్ రోజు ఉస్మానియా కాలేజీ వద్ద ఉన్న మాజీ కార్పొరేటర్ వద్దకు ఓ గిరిజన యువకుడిని పంపి దాడి చేయించి చెప్పుతో కొట్టించినట్లు ఆయన వర్గీయుల్లో చర్చ జరుగుతోంది.

కౌంటింగ్ ఏర్పాట్లు భేష్

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆమె ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి సంతకం చేశారు. అనంతరం కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేస్తున్న ఇంజినీరింగ్, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ బ్లాక్‌ల్లో పర్యటించి చేపట్టిన ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. ఈవీఎంలను తీసుకొచ్చే సమయంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా విద్యుత్ వైర్లు బయటకు కనిపించకుండా చూసుకోవాలన్నారు.

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి టేబుల్ వారీగా ఫలితాలను ప్రింట్ చేసి ఏజెంట్లకు ఇవ్వడానికి పెద్దసైజు ఫొటో కాపీ మెషీన్‌ను ఏర్పాటు చేయిస్తామని, ఆ దిశగా ఆర్వోలు ప్రతిపాదనలు పంపాలన్నారు.
- కౌంటింగ్ కేంద్రాల్లో ఎవరు పడితే వారిని అనుమతించరాదన్నారు.
- ఆర్‌యూ మెయిన్ ఎంట్రెన్స్ నుంచి కేవలం అబ్జర్వర్లు, కలెక్టర్, ఎస్పీ, అన్ని నియోజకవర్గాల ఆర్వోలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.
- మిగతా కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులతో పాటు ఏజెంట్లను బాయ్స్ హాస్టల్ వెనుక భాగం నుంచి అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.
- అక్కడే మొబైల్ డిపాజిట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ఇక్కడ పనిచేసేందుకు సచివాలయ ఉద్యోగులను నియమించాలన్నారు.
- కౌంటింగ్ సిబ్బంది కోసం జూన్ 4న ఉదయం 5 గంటలకు కలెక్టరేట్ నుంచి ఉచితంగా బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు.
- కలెక్టర్ వెంట ఎస్పీ కృష్ణకాంత్, ఆర్వోలు నారపురెడ్డి మౌర్య, భార్గవ్‌తేజ, శివ్‌నారాయణ్ శర్మ, ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, మురళీ, రామునాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో కె.మధుసూధన్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్ ఉన్నారు.



పాణ్యం కౌంటింగ్ హాలు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జి.సృజన, చిత్రంలో ఎస్పీ జి.కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య

ఏ కౌంటింగ్ హాలు ఎక్కడంటే..

నియోజకవర్గం పేరు	కౌంటింగ్ హాలు ప్రదేశం
ఎమ్మిగనూరు, పాణ్యం, కోడుమూరు, ఆలూరు	ఇంజనీరింగ్ బ్లాక్
కర్నూలు, ఆదోని	లైఫ్ సైన్సెస్ బ్లాక్
మంత్రాలయం, పత్తికొండ	లైబ్రరీ బ్లాక్

బడి బస్సులు భద్రమేనా?

- త్వరలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం
- పిల్లల భద్రత అత్యంత కీలకం
- స్కూల్ బస్సులకు సామర్థ్య పరీక్షలు తప్పనిసరి
- ఉమ్మడి జిల్లాలో విద్యాసంస్థల బస్సులు సుమారు 1,014
- ఇప్పటి వరకు ఎఫ్‌సీ రెన్యూవల్ చేసుకున్నవి 559
- ఇంకా చేయించుకోవాల్సినవి 455



ప్రైవేట్ స్కూల్ బస్సు సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ నాగరాజు నాయక్



బడి బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను పరిశీలిస్తున్న ఆర్‌టీఓ రమేష్

కర్నూలు: వచ్చే నెలలో విద్యాసంస్థలు ప్రారంభమవుతాయి. పిల్లలకు ఉత్తమ విద్య అందించాలని తల్లిదండ్రులు ఇప్పటికే భారీగా ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చేర్పిస్తున్నారు. కేవలం పిల్లల చదువుపై మాత్రమే కాకుండా వారిని నిత్యం ఇంటి నుంచి పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించే బడి బస్సుల సామర్థ్యంపై కూడా దృష్టి సారించాలి. ఎందుకంటే బడి బస్సు భద్రంగా ఉంటే పిల్లల ప్రయాణం సురక్షితమవుతుంది. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల యజమానులు బస్సుల నిర్వహణపై జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాలల పునఃప్రారంభానికి ముందే బస్సు సామర్థ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆర్టీఏ అధికారులు సూచిస్తున్నారు.

అనుమతి ఉంటేనే...

కర్నూలులో డీటీసీ కార్యాలయం, ఆదోని, నంద్యాలలో ప్రాంతీయ రవాణా కార్యాలయాలతో పాటు డోన్, ఆత్మకూరు ప్రాంతాల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బస్సులకు పరీక్షలు నిర్వహిస్తారు. అనుమతులు లేని వాటికి జరిమానాలు, కేసులు నమోదు చేస్తుంటారు. వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలు ఉన్నాయా లేదా నిశితంగా పరిశీలిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 1,014 బస్సులు ఉన్నాయి. ఇప్పటివరకు 559 బస్సులకు ఎఫ్‌సీ చేయించుకోగా ఇంకా 455 బస్సులు రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లో ఈ–స్లాట్ తేదీల ఖరారు...

ఏటా మే 16 నుంచి జూన్‌లో విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు రవాణా శాఖ కార్యాలయంలో బడి బస్సులకు ఎఫ్‌సీ చేయించి ధ్రువీకరణ పత్రాలు పొందాలి. వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్‌లోనే విద్యాసంస్థల యాజమాన్యాలు ఏపీ ట్రాన్స్‌పోర్ట్ ఈ–ప్రగతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం ఎఫ్‌సీ చేయించుకునేందుకు రవాణా శాఖ కార్యాలయం అధికారులు ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తీసుకెళ్తే ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహిస్తారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని రవాణా శాఖ కార్యాలయాల వద్ద స్కూల్, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాహనాలు ఎలా ఉండాలనే విషయమై ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలకు రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

	మొత్తం బడి బస్సులు	ఎఫ్‌సీ చేయించుకున్నవి	చేయించుకోవాల్సినవి
కర్నూలు జిల్లా	416	250	166
నంద్యాల జిల్లా	598	309	289

నిబంధనల్లో ముఖ్యమైనవి కొన్ని..

- ఆర్‌టీఏ అధికారులు జారీ చేసిన సామర్థ్య పరీక్ష పత్రాలను బస్సులో ప్రదర్శించాలి.
- ప్రతి బడి బస్సుకు పసుపు రంగు తప్పనిసరి.
- 15 ఏళ్ల దాటిన వాహనాలను తిప్పరాదు.
- వాహనంలో ప్రథమ చికిత్స కిట్లు, మందులతో పాటు అత్యవసర ద్వారాలు ఉండాలి.
- బస్సులో అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు వీలుగా ఫైర్ ప్రొటెక్షన్ సిలిండర్ ఉండాలి
- డ్రైవర్ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి.
- బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందు తలుపు ముందు సమాంతరంగా రైలింగ్ ఏర్పాటు చేయాలి.
- బస్సు ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులతో రాంగ్ రూట్‌లో ప్రయాణించరాదు.

ఇవి తప్పనిసరి...

పాఠశాలలు, కళాశాలల బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా ఉమ్మడి జిల్లాలోని ఆర్‌టీఏ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉంటున్నారు. ఫిట్‌నెస్ ధ్రువ పత్రం, పర్మిట్, ఇన్సురెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవర్‌కు సంబంధించి వాల్యూడ్ లైసెన్స్ సమర్పించి సామర్థ్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. డ్రైవర్‌తో పాటు బస్సులో ఉండే అటెండెంట్ వివరాలను కార్మిక శాఖ కార్యాలయంలో నివేదించి వారు ధ్రువీకరించిన పత్రం సైతం రవాణా శాఖ కార్యాలయంలో సమర్పించాలి. డ్రైవర్ బస్సును వేగంగా నడిపినా, అజాగ్రత్తగా వ్యవహరించినా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపినా అతనిపై చర్యలు తీసుకునేలా పాఠశాల పేరెంట్స్ కమిటీ ద్వారా బస్సుల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి.

ఫిట్‌నెస్ లేకుండా బయట తిరిగితే సీజ్



పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభమవుతున్న దృష్ట్యా బస్సులకు తప్పకుండా సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి. జిల్లాలో నమోదైన పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు బస్సుల సామర్థ్యంపై దృష్టి సారించాలి. ఏ ఒక్క పత్రం లేకుండా బస్సు రోడ్డుపై ఎక్కినా అలాంటి వాటిపై చర్యలు తీసుకోవడమే కాకుండా సీజ్ చేస్తాం. – **రమేష్, ఆర్‌టీఓ**

క్లుప్తంగా

ఎంబ్రాయిడరీలో మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎంబ్రాయిడరీ (జర్దోసి మగ్గం), ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. జూన్ 19 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు చదవడం, రాయడం వచ్చిన మహిళలు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 63044 91236 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారికి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామభూపాల్ రెడ్డి జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి జిల్లా కేంద్రానికి చెందిన మోత్కూరు మధు, కొత్తపల్లె గ్రామానికి చెందిన కొప్పెర చంద్రశేఖర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీస్ సిబ్బందికి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. నిందితులను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా వారికి ఏడు రోజులు జైలు శిక్షవిధించినట్లు పోలీసులు తెలిపారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల 1 టౌన్ ఏరియాలో బహిరంగ ప్రదేశాల్లో మతం తాగుతూ ప్రజలకు అసౌకర్యం కలిగించిన షేక్ ఖాసిం, షేక్ నూర్‌బాషాను పోలీసులు అదుపులోకి తీసుకొని నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామభూపాల్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. జడ్జి విచారించి నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి 7 రోజులు పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

జిరాక్స్ సెంటర్ సీజ్



జిరాక్స్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న ఆర్ఐ మస్తాన్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి కొత్తబస్టాండు సమీపంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న నీలకంఠేశ్వర జిరాక్స్ సెంటర్‌ను బుధవారం ఆర్ఐ మస్తాన్, వీఆర్ఓ ప్రసాద్ సీజ్ చేశారు. అడంగల్, ఇతరత్రా ప్రభుత్వ ధ్రువపత్రాలు అక్రమంగా, అనుమతులు లేకుండా జారీ చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా ఓ రైతుకు బ్యాంకు రుణ కోసం ఏకంగా తహసీల్దార్ కార్యాలయం సీల్, సంతకం ఫోర్జరీ చేసినట్లు ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ గుర్తించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) తదితర కార్యాలయాల్లో సేవలకు సంబంధించిన ప్రభుత్వ లోగోతో కూడిన ధ్రువపత్రాలు సైతం అక్రమంగా కలిగి ఉండడంతోపాటు వాటిని జారీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

గనుల శాఖ విధానాలపై వర్క్‌షాప్

కర్నూలు (న్యూటౌన్): గనుల శాఖ అనుసరిస్తున్న వివిధ విధానాలపై బుధవారం బెంగళూరులో వర్క్‌షాప్ నిర్వహించారు. సెంట్రల్ మైనింగ్ సెక్రటరీ కాంతారావు, జాయింట్ సెక్రటరీ వీణ హాజరైన ఈ సమావేశంలో దేశంలోని అన్ని జిల్లాల మైనింగ్ అధికారులు, డైరెక్టర్లు, గ్రానైట్ ఫెడరేషన్స్ నాయకులు పాల్గొన్నారు. గ్రానైట్‌పై ఉన్న రాయల్టీ, ఇతర పన్నులను తగ్గించాలని, విదేశాల నుంచి ముడి గ్రానైట్ రాయిని దిగుమతి చేసుకునేందుకు అనుమతులివ్వాలని గ్రానైట్ ఫెడరేషన్స్ సభ్యులు కోరినట్లు జిల్లా నుంచి హాజరైన మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు.

సిమెంట్ వినియోగంపై ఆరా

- జిల్లాలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో వివిధ నిర్మాణ పనులు
- ఆయా పనులకు వినియోగించిన సిమెంట్ వివరాలను కోరిన ప్రభుత్వం
- 78 కాలమ్స్ ఫార్మాట్ పంపిన పీఆర్ ఉన్నతాధికారులు
- ఈ నెలాఖరు నాటికి వివరాలు పంపాలని ఆదేశాలు



సిమెంట్ వినియోగానికి సంబంధించిన వివరాలను పొందుపరిచే పనిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

కర్నూలు(అర్బన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ నిర్మాణ పనులకు వినియోగించిన సిమెంట్‌పై పూర్తి స్థాయి వివరాలు పంపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే కర్నూలు, ఆదోని డివిజన్లకు చెందిన ఇంజినీర్లు, ఆయా ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిసెంట్లు ఈ పనిలో నిమగ్నమయ్యారు. వివరాలను పంపేందుకు ప్రత్యేకంగా 78 కాలమ్స్‌తో రూపొందించిన ప్రత్యేక ఫార్మాట్‌ను పీఆర్ ఉన్నతాధికారులు పంపారు. ఈ ఫార్మాట్‌లో కోరిన విధంగా వివరాలను పూర్తి చేసి పంపించాల్సి ఉంది. ముఖ్యంగా జిల్లాలో చేపడుతున్న ప్రాధాన్యత భవనాలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు ఎంత సిమెంట్ అవసరమని ఇండెంట్ రైజ్ చేశారు? ప్రభుత్వం ఎంత సరఫరా చేసింది ? అందులో ఎంత వినియోగించారు ? ఇతర పనులకు ఏమైనా వినియోగించారా ? ఒక వేళ వాడితే తిరిగి రిసీవ్ చేసుకున్నారా ? ప్రస్తుతం ఎంత బ్యాలెన్స్ ఉంది ? అనే వివరాలను ఫార్మాట్‌లో పొందుపరచాల్సి ఉంది. అలాగే .... వినియోగించిన సిమెంట్‌కు సంబంధించి ఎంబుక్ వారీగా వివరాలు కూడా పంపాలని ఉన్నతాధికారులు కోరారు. ఈ నేపథ్యంలోనే 2020–21 నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ప్రతి మండలంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో పాటు ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంట్ వినియోగం, ఆయా పనులకు బయటి మార్కెట్‌లో కొనుగోలు చేసిన సిమెంట్ వివరాలను పీఆర్ ఇంజినీర్లు పంపాల్సి ఉంది.

భారీగా జరిగిన అభివృద్ధి పనులు

జిల్లాలో గత ఐదేళ్లుగా భారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాధాన్యత భవనాలతో (గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, వైఎస్సార్ బల్క్ మిల్క్ యూనిట్లు) పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి సచివాలయ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు 456 గ్రామ సచివాలయాలకు గాను 242 పూర్తి అయ్యాయి. అలాగే 446 రైతు భరోసా కేంద్రాలకు గాను 208, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్ 354 భవనాలకు గాను 135 పూర్తి అయ్యాయి. అలాగే ... ఒక్కో గ్రామ సచివాలయ పరిధిలో రూ.40 లక్షల విలువ చేసే పనులు చేపట్టారు. ఈ పనులకు సంబంధించి ఇప్పటి వరకు దాల్మియా, జేఎస్‌డబ్ల్యూ, మహా, భారతి, జువారి, రెయిన్, రాంకో, పెన్నా, శివజ్యోతి తదితర కంపెనీల నుంచి ప్రభుత్వం దాదాపు 50 వేల మెట్రిక్ టన్నుల (10 లక్షల బస్తాలు) సిమెంట్‌ను సరఫరా చేసింది.

నెలాఖరు నాటికి పూర్తి వివరాలు ...

వినియోగించిన సిమెంట్‌పై పూర్తి వివరాలను ఈ నెలాఖరు నాటికి పీఆర్ ఈఎన్‌సీ కార్యాలయానికి పంపించాల్సి ఉంది. దీంతో జిల్లాలోని ఆయా మండలాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఈ, డీఈఈలు వర్కుల వారీగా ఎంబుక్‌లను పరిశీలిస్తు ఫార్మాట్‌లో కోరిన విధంగా వివరాలను పొందుపరుస్తున్నారు.

నాలుగు కిలోల ఆడశిశువు జననం



శిశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ నాగరాజు

కోడుమూరు రూరల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉదయం గోనెగండ్ల మండలం నెల్లిబండ గ్రామానికి చెందిన పూజారి అనిత మొదటి కాన్పులోనే నాలుగు కిలోలున్న పండంటి ఆడ శిశువుకు జన్మచ్చింది. కాన్పు అనంతరం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సాధారణంగా అప్పుడే పుట్టిన శిశువు బరువు రెండున్నర నుంచి మూడు కిలోల లోపు ఉంటుందన్నారు. అయితే 4కిలోల శిశువు పుట్టడం, అది కూడా నార్మల్ కాన్పు కావడం విశేషమన్నారు.

టార్పాలిన్ లేకుండా ఇసుక రవాణా చేస్తే వాహనాలు సీజ్



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన సెబ్ అధికారులు

కర్నూలు : ఇసుక రవాణాకు అనుమతి ఉన్నా టార్పాలిన్ కప్పకుండా తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ హెచ్చరించారు. ఇసుక, మద్యం, నాటుసారా అక్రమ రవాణాపై జిల్లా వ్యాప్తంగా సెబ్ అధికారులు బుధవారం కూడా విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని వాటి యజమానులపై కేసులు నమోదు చేశారు. 36 టన్నుల ఇసుకను సీజ్ చేసి ట్రాక్టర్ల యజమానులకు రూ.90 వేలు జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ తెలిపారు. అలాగే కర్నూలు, ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో హైకోర్టు తీర్పు ఆదేశాల మేరకు ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక తోలేందుకు అనుమతి ఉన్నప్పటికీ టార్పాలిన్ షీటు కప్పుకోకుండా నియమాలు ఉల్లంఘించినందుకు వాహనాలను స్వాధీనం చేసుకుని కాంపౌండింగ్ కోసం మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. అధికారుల అనుమతితో ఇసుకను రవాణా చేసేవారు కూడా టార్పాలిన్ కప్పాల్సిందేనన్నారు. అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలో మద్యం అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 150 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు రవికుమార్ తెలిపారు. అలాగే ఏపీకి చెందిన మద్యం కూడా అక్రమంగా తరలిస్తుండగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 12 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు తెలిపారు.



లారీ ఎక్కిన రైలింజన్

రైలింజన్ ఎంటీ..లారీ ఎక్కడేమిటీ అనుకుంటున్నారా! ఇది నిజమే. బుధవారం ఈ దృశ్యం కర్నూలు – బెంగళూరు 44వ జాతీయ రహదారిలో వెల్దుర్తి వద్ద కనిపించింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 54 టైర్లు కలిగిన భారీ లారీ (కంటైనర్)లో రైలింజన్‌ను తీసుకెళ్తున్నారు. ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు కొందరు ఆసక్తిగా చూడగా..మరికొందరు కంటైనర్ ఆగిన చోట సెల్ఫీలు దిగారు.

–కర్నూలు (న్యూటౌన్)

ముమ్మరంగా వేరుశనగ పంపిణీ

- ఇప్పటికే 4,155 క్వింటాళ్ల పంపిణీ
- 11,104 క్వింటాళ్లకు పేర్లు నమోదు చేసుకున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సబ్సిడీపై వేరుశనగ పంపిణీ చురుగ్గా సాగుతోంది. వేరుశనగ కోసం రైతులు పోటెత్తుతున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువకు లభిస్తుంటం, మిర్చి, ఇతర పంటల రైతులు వేరుశనగ సాగు వైపు మళ్లడంతో డిమాండ్ పెరిగింది. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారానే వేరుశనగ కాయలు పంపిణీ చేస్తుండటం విశేషం. జిల్లాకు 13,929 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించగా... ఇప్పటికే 12,843 మంది రైతులు 11,104 క్వింటాళ్ల కోసం ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ రిపోర్టు ప్రకారం 4155 క్వింటాళ్లు పంపిణీ అయింది. ఏపీసీడ్స్ ఇప్పటి వరకు దాదాపు 250 ఆర్‌బీకేల్లో 8,700 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉంచింది. కర్నూలు జిల్లాలో వేరుశనగ ముమ్మరంగా పంపిణీ జరుగుతోంది. నంద్యాల జిల్లాలో ఈ నెల 30 నుంచి పంపిణీ చేపట్టడానికి వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం వేరుశనగకు మినహా మిగిలిన విత్తనాలపై రైతులు దృష్టి సారించలేదు. ఒకటి, రెండు రోజుల్లో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీ చేపట్టనున్నారు. కందులు, మినుములు తదితర వాటికి ఇంకా ధరలు నిర్ణయించాల్సి ఉంది.

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏలు

డోన్ రూరల్ : విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు విక్రయిస్తే షాప్ లైసెన్స్ రద్దు చేస్తామని ఆళ్లగడ్డ, డోన్ ఏడీఏలు రామ్మోహన్‌రెడ్డి, అశోక్‌వర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. కిరణ్ హైబ్రిడ్ సీడ్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ తదితర షాపులను బుధవారం వారు తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్లులు, కంపెనీల వారీగా సర్టిఫికెట్స్‌ను పరిశీలించారు. అనంతరం ఏడీఏలు మాట్లాడుతూ రైతులు అడిగిన రకాల విత్తనాలనే విక్రయించాలని, తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదు వచ్చిన విచారణ చేసిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ, డీలర్స్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బనగానపల్లె రూరల్ : మండల పరిధిలోని చెర్లోకొత్తూరు గ్రామంలో ఎస్ మల్లికార్జునరెడ్డి(38) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ రామిరెడ్డి బుధవారం తెలిపారు. మల్లికార్జురెడ్డికి సుమారు తొమ్మిదేళ్ల క్రితం లక్ష్మీతో వివాహం కాగా ఇద్దరు సంతానం. మల్లికార్జునరెడ్డి మద్యం సేవిస్తూ, జులాయిగా తిరుగు తుండడంతో భార్య లక్ష్మీ కొన్ని నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఇంటి నుంచి బయటికి వచ్చిన మల్లికార్జునరెడ్డి బుధవారం ఉదయం గ్రామ సమీపాన మృతి చెందిపడి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రాణాలు తీసుకున్నారు

- వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒకే రోజు నలుగురు యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కారణాలేమైనా కుటుంబ సభ్యులకు కడుపుకోత మిగిల్చి వెళ్లారు. ఎంతో భవిష్యత్ ఉన్నా అర్ధాంతరంగా తమ జీవితాలను చాలించారు.

పురుగు మందు తాగి..



మృతుడు మహేష్(ఫైల్)

పగిడ్యాల: కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చెందిన మహేష్ (28) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏడేళ్ల క్రితం పీకే ప్రాగటూరు గ్రామానికి చెందిన బోయ పార్వతిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. శుభకార్యం నిమిత్తం భార్య మంగళవారం ఉదయం పుట్టినింటికి వెళ్లింది. మహేష్ రాత్రి వెళ్లాడు. కార్యక్రమం ముగించుకుని ఉదయం ఒక్కడే స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో కేసీ కాలువ గట్టుపై పురుగు మందు తాగాడు. ఇదే విషయాన్ని స్నేహితునికి ఫోన్ ద్వారా మెసేజ్ పంపడంతో వారు అక్కడకు చేరుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహేష్‌ను కర్నూలుకు తరలించారు. చికిత్స నుంచి కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తండ్రి గంగరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. కాగా ఆత్మహత్యకు కారాణాలు తెలియరాలేదు.

ఉరివేసుకుని ..



రమేష్(ఫైల్)

పగిడ్యాల: ఉరివేసుకుని ఓ యువకుడు బల వన్మరణానికి పాల్పడిన ఉదంతం బుధవా రం పగిడ్యాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీరాములు కుమారుడు రమేష్ (20) పదవ తరగతి వరకు చదివి కాంక్రీట్ పనులు చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. మంగళవారం స్నేహతులతో కలిసి బాదనమ్మ బావి వద్ద విందు ఏర్పాటు చేసుకుని సంతోషంగా గడిపాడు. అనంతరం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఏమైందో ఏమో కానీ బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు నిద్రలేచి ఇంట్లోకి వెళ్లి చూడగా తాడుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. రమేష్ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

అర్చకుడు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న పూజారి మహేష్

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని లింగాయతి సత్రంలో 13వ నెంబరు గదిలో అర్చకుడు వారి గణేష్ (24) బుధవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నారు. వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు.. ఆదోని మండలం రౌడూరు గ్రామానికి చెందిన గణేష్ శ్రీశైలంలోనే నివాసం ఉంటూ బయలు వీరభద్రస్వామి, అటకేశ్వరం వద్ద ముకుందాశ్రమం, సున్నిపెంటలోని గాయత్రి మాత మందిరం, తదితర ప్రదేశాల్లో పౌరోహిత్యం చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. ఏమైందో కానీ ఉదయం 9 గంటల సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విచారణలో ఆత్మహత్యకు గల కారణాలు తెలుస్తాయని ఎస్ఐ తెలిపారు.

పెళ్లి కాదన్న కలతతో ..



ఆత్మహత్య చేసుకున్న బనావత్ రఘునాయక్

కర్నూలు: రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి దివ్యాంగుడిగా ఏడాది కాలంగా ఇబ్బందులు పడుతున్న తనకు పిల్లనెవ్వరూ ఇవ్వరన్న బెంగతో కర్నూలు బి.క్యాంప్‌లో నివాసముంటున్న బనావత్ రఘు నాయక్ (27) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాదిగా నంద్యాల చెక్‌పోస్టులోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద చికెన్ పకోడ దుకాణాన్ని నడుపుకుంటున్న ఈ యువకుడు అంతకు ముందు కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. 2022లో కోడుమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్యాలకుర్తి సమీపంలో అతను నడుపుతున్న కారు ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో కారులో ఉన్న ముగ్గురు చనిపోగా రఘు నాయక్‌కు ఎడమ కాలు విరిగింది. ఆపరేషన్ చేయించుకుని కుంటుతూ నడిచేవాడు. దీంతో ఆయనకు అమ్మాయిని ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. జీవితంలో తనకు పెళ్లి కాదని మదన పడుతూ ఉండేవాడు. అలాగే కారు ప్రమాదానికి సంబంధించిన కేసు కూడా విచారణలో ఉంది. బుధవారం ఉదయం ఎప్పటిలాగే చికెన్ తీసుకువచ్చి పకోడ సిద్ధం చేయాలని వదిన (అన్న భార్య)కు ఇచ్చి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో వదిన గుర్తించి గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టి ఉరి నుంచి రఘునాయక్‌ను తప్పించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి లక్ష్మిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

ఇలా చేస్తే డ్రిప్ పరికరాలు మన్నిక

- బిందుసేద్యంలో ఆమ్ల ప్రక్రియ కీలకం
- ఈ విధానంతో డ్రిప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు
- ఏపీఎంఐపీ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రాజాకృష్ణారెడ్డి సూచనలు



డ్రిప్ సిస్టమ్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో డ్రిప్ (బిందు) సేద్యం పెరుగుతోంది. దాదాపు 1.20 లక్షల ఎకరాలకు డ్రిప్ ఉంది. దీనిని సమర్థవంతంగా వినియోగించాలంటే ఆమ్ల ప్రక్రియ (యాసిడ్ ట్రీట్‌మెంట్) అత్యవసరం. సిస్టమ్‌లో పేరుకున్న లవణాలను తొలగించేందుకు ఆమ్ల ద్రావణా (నీటి ఉదజని సూచిన 3 కలిగిన) న్ని పంపించి కొద్ది గంటలు(24 గంటలు) పాటు ఉంచితే అందులో పేరుకున్న లవణాలు కరిగి ద్రవరూపంలోకి మారిన తర్వాత సిస్టమ్ నుంచి ఫ్లష్ వాల్వ్ ద్వారా బయటకు వస్తుంది. దీని వల్ల పరికరాల పనితనం మెరుగుపడటమే కాక ఎక్కువ కాలం మన్నిక వస్తాయని ఏపీఎంఐపీ అదనపు పీడీ రాజాకృష్ణారెడ్డి తెలిపారు. డ్రిప్‌లో కీలకమైన ఆమ్ల ప్రక్రియ విధానం గురించి ఆయన ఇలా వివరించారు.

పొలాల్లో డ్రిప్ సిస్టమ్ వేసుకున్న రైతులు పంట పూర్తి అయిన తర్వాత లైటరల్ పైపులను చుట్టలుగా చుట్టి ఇళ్ల దగ్గర, పొలం గట్లపైన వారికి అవకాశం ఉన్న చోట భద్రపరుచుకుంటారు. అయితే ఈ పరికరాలను భద్రపరిచేటప్పుడు ఆమ్ల ప్రక్రియ చేపడితే వచ్చే సీజన్‌లో వేసే పంటలకు నేరుగా లేటరల్ పరికరాలను పరుచుకోవచ్చు. ఇది సాధ్యం కాకపోతే రైతులు తమ పొలాల్లో పంటను వేసే ముందు తప్పనిసరిగా డ్రిప్‌లో ఆమ్ల ప్రక్రియ చేపట్టాలి. దీంతో పైపుల మన్నిక పెరగడంతో పాటు డ్రిప్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేస్తుంది. మొక్కలకు నీరు పూర్తిస్థాయిలో అందడం జరుగుతుంది. ఈ ప్రక్రియ జరపక పోతే నీరు సమపాళ్లలో మొక్కలకు అందకపోవడం వల్ల వాటి పెరుగదలలో వ్యత్యాసం కనబడుతుంది.

ఆమ్ల ప్రక్రియ చేపట్టే విధానం

ఆమ్ల ప్రక్రియ చేపట్టేందుకు హైడ్రో క్లోరిక్ యాసిడ్(35 శాతం), లేదా నైట్రిక్ యాసిడ్ (33 శాతం)లేదా సల్ఫ్యూరిక్ యాసిడ్ (65 శాతం) లేదా ఆర్థో ఫాస్ఫరిక్ యాసిడ్ (85 శాతం) రసాయనాల్లో ఏదైనా ఒకదానిని వాడవచ్చు. అయితే హైడ్రో క్లోరిక్ యాసిడ్ (35 శాతం) మార్కెట్‌లో మిగిలిన రసాయనాల కన్నా...చవక ధ రకు లభించటంతో పాటు వినియోగానికి అనుకూలంగా ఉంటు ంది.అయితే దీనిని పంట లేని సమయంలోనే వాడాల్సి ఉంది.

☛ ఎకరా విస్తీర్ణంలో ఆమ్ల ప్రక్రియ వెంచురి ద్వారా 15 నిముషాల్లో చేపట్టేందుకు 38 లీటర్ల ద్రావణం అవసరం. ఆమ్ల ద్రావణాన్ని తయారు చేయడానికి 38 లీటర్ల ద్రావణంలో 25 లీటర్ల నీటిని , 13 లీటర్ల ఆమ్లాన్ని(హైడ్రో క్లోరిక్ ఆమ్లం) ముందుగా లెక్కించుకున్న ప్రకారం తీసుకోవాల్సి ఉంటుంది. దీని కోసం బకెట్/డ్రమ్ములో నిర్ధారించిన నీటిలో (25 లీటర్లు) యాసిడ్(13 లీటర్లు)ను నెమ్మదిగా పోస్తూ మిశ్రమాన్ని తయారు చేసుకోవాలి. తర్వాత సిస్టమ్ ఆన్‌చేసి త్రోటిల్ వాల్వ్‌ను కొద్ది కొద్దిగా మూయాలి. అప్పుడు వెంచురి నుంచి వచ్చే నీరు ఎప్పుడైతే వెనక్కి పీల్చుకోవడం మొదలవుతుందో.. అప్పుడు వెంచురి ఫుట్‌బాల్‌ను యాసిడ్ ద్రావణం కలిగిన బకెట్/డ్రమ్ములో ఉంచాలి. యాసిడ్ ద్రావణం వెంచురి ద్వారా ప్రవహిస్తూ అవుట్‌లెట్ ద్వారా తిరిగి మెయిన్‌లైన్‌లోనికి రావడం జరుగుతుంది. సిస్టమ్‌లో యాసిడ్ ద్రావణం చేరిందో లేదో తెలుసుకోవడానికి సెక్షన్‌లోని ఆఖరి లేటరల్‌లోని చివరి డ్రిప్పరు వద్ద పీహెచ్ పేపరు ద్వారా వస్తున్నది లేనిది చూసుకోవాల్సి ఉంది. పీహెచ్ 3 వచ్చిన వెంటనే సిస్టమ్‌ను ఆఫ్ చేసి 24 గంటల పాటు అలాగే వాడకుండా ఉంచాలి.

☛ 24 గంటల తర్వాత సబ్ మెయిన్ చివర్లో ఉన్న ఫ్లష్ వాల్యులను తెరచి సిస్టమ్‌లోని నీటిని, లవణాలను బయటికి పోయేలా ఫ్లష్ చేయాలి. ఆ తర్వాత లేటరల్ పైపు చివర్లో ఉన్న ఎండ్ క్యాప్‌లను విప్పి లేటరల్ పైపుల్లోని నీటిని, లవణాలను ప్రెసర్‌తో బయటికి పంపాలి. పొలంలోని సిస్టమ్‌ను శుభ్రపరుచుకున్న తర్వాత నీటిపారుదల ప్రణాళికను అనుసరించి నీటిని పెట్టుకోవడం ప్రారంభించాల్సి ఉంది.

☛ యాసిడ్ ఆమ్ల ప్రక్రియ చేపట్టేటప్పుడు సిస్టమ్‌లో ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలి. నోటికి, ముక్కుకు మాస్క్‌వేసుకోవడంతో పాటు కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి. తొలిసారి ఆమ్ల ప్రక్రియ చేపట్టే రైతులు ఏ కంపెనీకి చెందిన డ్రిప్ పరికరాలు అమర్చుకున్నారో.. ఆ కంపెనీ సాంకేతిక నిపుణుల సహకారం తీసుకోవాల్సిన అవసరం ఉంది.